నిబంధనల మేరకే ఎరువులు విక్రయించాలి

మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి

ఆమనగల్లు, మే 24: ఆమనగల్లు మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులకు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారిణి అరుణకుమారి అన్నారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణం కేంద్రంలోని అధీకృత డీలర్లులైన సూర్య అగ్రిషాప్, శ్రీ మహేంద్ర ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారిణి అరుణ కుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఎరువు బస్తాను ఈ పాస్ మిషన్ ద్వారా మాత్రమే విక్రయించాలన్నారు. దీని ద్వారా బ్యాలెన్స్ ఎరువుల వివరాల ప్రకారం షాప్‌లో ఉండాలని, ప్రతి రోజూ అమ్మిన ఎరువులను స్టాక్స్ నుంచి తీసివేయాలని, కొత్తగా వచ్చిన ఎరువులను ఈ పాస్‌లో నమోదు చేయాలని ఆమె సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులను విక్రయించాలని లేని పక్షంలో సంబంధిత డీలర్స్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీలర్లు సురేశ్, జంగయ్య ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

చేవెళ్ల డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి అశోక్‌యాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి అశోక్‌యాదవ్

షాబాద్, మే 24: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని చేవెళ్ల డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి వి. అశోక్‌యాదవ్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి రైతువేదికలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల కలిగి ప్రయోజనాలు, లాభాలు, మిగతా పంటలతో పోల్చినప్పుడు ఆయిల్‌పామ్ పంట వేయడం వల్ల ఉపయోగాలు తదితర అంశాలపై రైతులకు క్లుప్తంగా వివరించారు. ఆయిల్‌పామ్‌కు సంబంధించి అనుకూల నేలలు, నీటి లభ్యత, నాటే విధానం, సాగునీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, అంతరపంటలు, గెలల దిగుబడి, కోతలకు సంబంధించిన వివరాలపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. నీరు తేలికగా ఇంకిపోయే గుణం ఉన్న నేలలు దీనికి అనుకూలంగా ఉంటుందని, సాగునీరు సమృద్ధిగా ఉండాలని చెప్పారు. త్రిభుజాకార పద్ధతిలో మొక్కలు నాటుకోవాలని, గుంతలో 400 గ్రాముల ఎస్ఎస్‌పీ, 200 గ్రాముల డీఏపీ, 50 గ్రాముల ఫోరేట్ వేసి మట్టితో నింపాలన్నారు. నాటిన తొలి మూడు సంవత్సరాల్లో అంతరపంటలు వేసుకోవచ్చని తెలిపారు. దిగుబడి 3-4 సంవత్సరాల మధ్య ప్రారంభమై, 25-30 సంవత్సరాల వరకు దిగుబడి పొందవచ్చని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగులో రైతులకు మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్, వ్యవసాయశాఖ ఏఈవో, హార్టికల్చర్ ఆఫీసర్లు వద్ద దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో గీత, వాల్యూ ఆయిల్‌పామ్, గ్యాస్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ రాకేశ్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ సుకన్య, అధికారులు

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

యాచారం, మే 24 : ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని ఎంపీపీ కొప్పు సుకన్య భాష అన్నారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ద్వారా ఎంత ధాన్యం తూకం వేశారని, ధాన్యం కొనుగోలు చేశారని, ఎంత ధాన్యం తరలించారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం అమ్ముకోవాలన్నారు. రైతులకు గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలన్నారు. ధాన్యం వర్షంలో తడువకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆమె సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య తదితరులున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

ఫర్టిలైజర్ దుకాణంలోని రికార్డులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్

షాద్‌నగర్‌టౌన్, మే 24: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాధికారి నిశాంత్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని విత్తన కంపెనీ, విత్తన డీలర్ షాపులను శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వానకాలంలో రైతులు నష్టపోయే విధంగా నకిలీ, కాలం చెల్లిన విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లో విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. అన్ని రకాల స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్‌ను మండల వ్యవసాధికారితో సర్టిపై చేయించుకోవాలని సూచించారు. రైతులకు ఫర్టిలైజర్ అమ్మితే తప్పనిసరిగా ఆధార్‌కార్డు ద్వారా ఈ పీవోఎస్ మెషిన్ బిల్‌ను రైతుకు ఇవ్వాలని, నేరుగా అమ్మడం చేయరాదన్నారు. రోజు వారీగా ధరలు, స్టాక్ వివరాలను తప్పనిసరిగా స్టాక్ బోర్డులో పెట్టాలన్నారు. పర్మిషన్ లేని గోదాంలో ఎటువంటి స్టాక్ నిల్వ చేయరాదన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అమ్మినా, నిల్వ ఉంచినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతులకు పర్మిట్ల మంజూరు



చేవెళ్ల రైతు వేదికలో పర్మిట్లను రాస్తున్న వ్యవసాయ అధికారులు

చేవెళ్లటౌన్, మే 24: వానకాలం సీజన్‌కు జనుము విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని చేవెళ్ల మండల వ్యవసాయ అధికారిణి తులసి తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో జనుముల పంపిణీకి సంబంధించి రైతులకు పర్మిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల క్లస్టర్‌లోని కేసారం, మల్కాపూర్ కుమ్మెర, ముడిమ్యాల్, రావులపల్లి, న్యాయట, దామరిగిద్ద గ్రామాల రైతులకు సబ్సిడీ కింద జనుములు అందజేసేందుకు చేవెళ్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో పర్మిట్లు పంపిణీ చేయడంతో ముడిమ్యాల సొసైటీలో జనుములు తెచ్చుకోవడం జరిగిందన్నారు. చేవెళ్ల రైతు వేదికలో 180 బాగుల జనుములు పంపిణీ చేసినట్లు తెలిపారు. 40కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.1448 చెల్లించి రైతులు జనుములు తీసుకెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రాజేశ్వర్‌రెడ్డి, వరుణ్ గౌడ్, రైతులు తదితరులు ఉన్నారు.

ప్రతి కూలీకి పనికల్పిస్తాం

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలశంకర్

మంచాల, మే 24: ఉపాధిహామీ పథకంలో పనికోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి కూలీకి పనికల్పిస్తామని మంచాల ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. శుక్రవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న ఫామ్ పాండ్స్ పనులను ఆయన పరిశీలించి అనంతరం కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూగర్భజలాల అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న ఫామ్ పాండ్స్ పనులు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. కూలీలకు తాగునీటి సౌకర్యంతో పాటు టెంట్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉపాధిలో పనిచేసే ప్రతి కూలీకి వారం వారం వారి ఖాతాలో డబ్బులు జమచేస్తున్నట్లు చెప్పారు.

మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా చంద్రశేఖర్

తుర్కయంజాల్, మే 24: తుర్కయంజాల్ మున్సిపాలిటి ఇంచార్జీ కమిషనర్‌గా మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పని చేస్తున్న బి.చంద్ర శేఖర్‌ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ దివ్య శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు.గతంలో తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన సత్యనారాయణరెడ్డి మూడు రోజుల క్రితం సస్పెన్షన్‌కు గురైన సంగతి అందరికి తెలిసిందే. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు చంద్రశేఖర్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

కందుకూరు, మే 24 : రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ కోరారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక రుణాలను తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి తోటి రైతులకు సహకరించాలని కోరారు. అదే విధంగా సహకార సంఘంలో వరి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. క్వింటాలుకు ఏ గ్రేడ్‌కు కింద రూ. 2,203వేలు సాధారణ రకానికి రూ. 2,180వేలు చెల్లిస్తునట్లు ఆయన వివరించారు.

వ్యక్తి అదృశ్యం

అనీల్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, మే 24: వాకింగ్‌కు వెళ్లి వ్యక్తి అదృశ్యమైన సంఘటన శుక్రవారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాలరాజు వివరాల ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌కాలనీకి చెందిన అనీల్(40) ఏడాది క్రితం పక్షవాతం రావడంతో ఇంట్లో ఉంటున్నాడు. రోజు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు శంషాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తాడు. గురువారం అతడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో అతడి భార్య సబిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బండ్లగూడ, మే 24: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎన్‌రెడ్డి ప్రాంతానికి చెందిన శిశుపాల్‌రెడ్డి(49) డీసీఎం వాహనంలో అవుటర్ రింగ్‌రోడ్డు గుండా శంషాబాద్ నుంచి గచ్చిబౌలికి వెళ్తున్నాడు. కాగా రాజేంద్రనగర్ అవుటర్ రింగ్‌రోడ్ వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీ కొట్టాడు. దీంతో డీసీఎం స్టీరింగ్ కడుపులో గుచ్చుకుని తీవ్ర గాయాల పాలైన శిశుపాల్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బండ్లగూడ పీఠంపై తొలి మహిళా మేయర్

- బాధ్యతలు స్వీకరించిన లతప్రేమ్‌గౌడ్
- డిప్యూటీ మేయర్‌గా రాజేందర్‌రెడ్డి
- మంచినీటి సమస్య పరిష్కారమే ధ్యేయం

బండ్లగూడ, మే 24: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి మహిళా మేయర్‌గా మద్దెల లతాప్రేమ్ గౌడ్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. గత మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవినీతి ఆరోపణలతో అవిశ్వాస తీర్మానం చేసిన విషయం విదితమే. కార్పొరేషన్‌లో ప్రస్తుతం 21మంది కార్పొరేటర్లు ఉన్నారు. కార్పొరేషన్ కార్యాయంలో ఆర్డీవో (రిటర్నింగ్ అధికారి) వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన మేయర్ ఎన్నిక జరిగింది. మేయర్ అభ్యర్థిగా లతప్రేమ్‌గౌడ్‌ను డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి బలపర్చగా, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిని కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి బలపర్చరారు. 17 మంది కార్పొరేటర్లు హాజరై చేతులు తమ సమ్మతి తెలిపారు. ఆర్డీవో వెంకట్‌రెడ్డి మేయర్ లతతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కమిషనర్ శరత్‌చంద్ర సమక్షంలో వారు బాధ్యతలను స్వీకరించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని స్థానిక కార్పొరేటర్ల సహాయంతో పరిష్కరానికి తగిన చర్యలు తీసుకుంటామని మేయర్ లత తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.

నీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంచినీటి సమస్య తీవ్ర స్థాయిలో ఉంది. తద్వారా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హిమయాత్‌సాగర్ నుంచి నీటిని విడుదల చేయించి కార్పొరేషన్‌కు నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ తెలిపారు.

కమిషనర్ శరత్‌చంద్ర సమక్షంలో మేయర్‌గా బాధ్యతలను స్వీకరిస్తున్న బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి మహిళా మేయర్ లతాప్రేమ్‌గౌడ్

నూతన మేయర్‌కు శుభాకాంక్షల వెల్లువ

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన లతాప్రేమ్‌గౌడ్‌కు ఎంపీ రంజిత్‌రెడ్డి, రాష్ట్ర పాడిపరిశ్రమల అభివృద్ధి శాఖ చైర్మన్ బోర్ర జ్ఞానేశ్వర్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లతో పాటు నాయకులు పెద్ద ఎత్తున విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న మేయర్ లత

మేయర్ లతకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఆర్డీవో వెంకట్‌రెడ్డి

కారు, బస్సు ఢీ.. ముగ్గురు మృతి

ఆమనగల్లు మండలం రామునుంతల శివారులో ఘటన

వివరాలు వెల్లడించిన ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్

ఆమనగల్లు, మే24: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందిన ఘటన ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు మండల పరిధిలోని రామునుంతల శివారు ప్రాంతంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వైపు బయలుదేరిన పికెట్ డిపో సూపర్ లగ్జరి ఆర్టీసీ బస్సు, దైవ దర్శనం అనంతరం శ్రీశైలం నుంచి హైదరాబాద్ వైపు కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్ హస్తినాపురం ద్వారకానగర్‌కు చెందిన బండారి శివకృష్ణ వరప్రసాద్ గౌడ్ (27), నల్గొండ జిల్లా నాంపల్లి మండలం రాందాస్ తండాకు చెందిన మేఘావత్ నిఖిల్ (26) బైర్‌మల్‌గూడకు చెందిన బుర్ర మణిదీప్ గౌడ్ (25) అక్కడికక్కడే మృతి చెందారు. జిల్లా పరిధిలోని ఇబ్రహీంపట్నం మండలం కేవీ తండాకు చెందిన బస్సు డ్రైవర్ వెంకటయ్య నిర్లక్ష్యం, అతివేగంగా నడపటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్ తెలిపారు. ఘటనా స్థలాన్ని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ నాగభూషణం, సీఐ ప్రమోద్‌కుమార్, పికెట్ డిపో మేనేజర్ రవీందర్ పరిశీలించారు.

శివకృష్ణ వరప్రసాద్ గౌడ్ (ఫైల్)

నిఖిల్ (ఫైల్)

మణిదీప్ గౌడ్ (ఫైల్)

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

యాచారం, మే24: విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మండలంలోని చౌదర్‌పల్లి, శ్రీమంతగూడలో శనివారం 11కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చౌదర్‌పల్లిలో గృహ, అగ్రికల్చర్ ఫీడర్‌కు, శ్రీమంతగూడ అగ్రికల్చర్ ఫీడర్‌కు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో..

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని మెట్టు ఫీడర్, 11కేవీ బాటసింగారం ఫీడర్ కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ విద్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెట్టు టౌన్, బీసీకాలనీ, లష్కర్‌గూడ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, ఓఆర్ఆర్, మైత్రిగోకులం 1, 2, నిత్యఅవెన్యూ, సాయినగర్ కాలనీ, న్యూలైఫ్ విల్లా, ఇనాంగూడ, యశోదనగర్‌కాలనీ, కార్తిక్ హోమ్స్, ఆర్టీసీ కాలనీ, జయశంకర్ కాలనీ, నోవా కాలేజ్, ఢిల్లి పబ్లిక్ స్కూల్, తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నంరూరల్ : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపేట్, అంబేద్కర్‌నగర్, సహార వాటర్‌ఫిల్టర్, వివేకానందకాలనీ, సిరిపురంకాలనీ, చైతన్యనగర్, భాగ్యనగర్‌కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్‌తీగలకు ఆనుకున్న చెట్లకొమ్మలను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ట్రాన్స్‌కో ఏఈ శుక్రవారం తెలిపారు.

అక్రమ నిర్మాణాలకు ఇక చెల్లు

- నిబంధనలు అతిక్రమిస్తే నేల కూలాల్సిందే..
- 27 నుంచి అక్రమ నిర్మాణాల కూల్చివేతలు
- నార్సింగి మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారిణి మణిహారిక

మణికొండ, మే 24: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో నిబంధనలను అతిక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలు నేల కూలనున్నాయి. ఈనెల 27న విజిలెన్స్, హెచ్ఎండీఏ, రెవెన్యూ, పోలీస్, టౌన్‌ప్లానింగ్ విభాగాలు సంయుక్తంగా కలిసి అక్రమ నిర్మాణాలను కూల్చివేయనున్నట్లు నార్సింగి మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారిణి మణిహారిక శుక్రవారం వెల్లడించారు. కొన్ని రోజులుగా ఇష్టానుసారంగా నిర్మాణదారులు మున్సిపాలిటీ పరిధిలోని నార్సింగి, కోకాపేట, గౌలిదొడ్డి, మంచిరేవుల, నార్సింగి గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతుల పొందారు. అంతేగాకుండా అదనంగా నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఎన్నికల హడావిడిలో అధికారులు అందుబాటులో ఉండరని భావించి చాలా చోట్ల అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలిశాయని పేర్కొన్నారు. వీటిని గుర్తించి రెండు పర్యాయాలు నోటీసులు జారీ చేసినా ఎలాంటి స్పందన రాకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చే సోమవారం నుంచి కూల్చివేతల ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. అక్రమ నిర్మాణాల్లో అమాయక ప్రజలు ఎలాంటి కొనుగోలు చేయవద్దని ఆమె సూచించారు. ఈ విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవం

కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

ఆర్కేపురం, మే 24 : శ్రీ వాసవీమాత కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాన్ని ఆర్కేపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ప్రొద్దటూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైష్ణవి కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో సుమారు 500 మంది మహిళలతో అభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్త, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశంగుప్త హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చిలుక ఉపేందర్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డి, చింతల రవికుమార్, లక్ష్మయ్య, నాగేంద్రయ్య, శ్రవణ్ కుమార్, అరవేటి వేణు మాధవ్, శ్యామ్, రామిని సద్గుణ, లక్ష్మీ సుబ్రమణ్యం, శ్రీలత, నాచం లక్ష్మి, వాణిశ్రీ, గంధం పద్మ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మొయినాబాద్, మే 24 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, కార్యక్రమాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి శ్రీలతరెడి అన్నారు. మండల పరిధిలోని సురంగల్ గ్రామంలో శుక్రవారం జీవాలకు చిటికె వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ జీవాలు ఉన్న ప్రతి రైతు చిటిక వ్యాధి నివారణ టీకాలు జీవాలకు వేయించడానికి ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది బీమ్, తదితరులు పాల్గొన్నారు.